క్లుప్తంగా

ఉచిత వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని, ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో గురువారం అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ తాము ప్రతీ ఏటా ప్రముఖ రిసోర్స్‌పర్సన్‌లతో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చిత్రలేఖనం, చేతిరాత, క్రాఫ్ట్, యోగా, క్లే వర్క్, వెస్ట్రన్, పోక్ డ్యాన్స్ తదితర విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి అభిషేకాలు, అర్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. స్వామివారి ఆలయానికి దక్షిణం వైపున ఉన్న దక్షిణామూర్తి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఈ కెఎస్.రామరావు పాల్గొనగా, ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి, మల్లేశ్వరాలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వరశాస్త్రి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మనకు ఉన్న దాంట్లోనే తోటి వారికి సహాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని విశ్వస్ఫూర్తి ధ్యాన్ జ్ఞాన్ మార్గ్ నగర కార్యదర్శి కాశీన వెంకటేశ్వరరావు అన్నారు. ఆధ్యాత్మిక విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి 84వ జయంతి సందర్భంగా మొగల్రాజపురంలోని విశ్వస్ఫూర్తి ధ్యాన్ జ్ఞాన్ మార్గ్ ఆశ్రమంలో సభ్యులు గురువారం ఉదయం పీఠపూజ, పాదపూజ, ఆసన, ప్రాణాయామం, ధ్యానం చేశారు. అనంతరం పాతపాడు, రాజీవ్‌నగర్, వాంబేకాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలోని వారికి నూతన వస్త్రాలు, పండ్లు, భోజనాలు అందజేశారు. మార్గ్ నగర కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురువిశ్వస్ఫూర్తి వారి జయంతి సందర్భంగా ప్రతి ఏటా సంస్థ తరుపున పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు, నళిని, భువనేష్, ప్రసన్న, విశ్వతేజ, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని దివ్యాంగులకు అనేక రకాలుగా మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటేసి జగనన్న రుణం తీర్చుకోవాలని వైఎస్సార్ ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, విద్యాధరపురానికి చెందిన షేక్ జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి దివ్యాంగుడు వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్‌గా నిలిచి తమ కుటుంబంతో పాటు బంధువు, స్నేహితులతో జగనన్న మనకు చేసిన మేలును వివరించి ఓట్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. రానున్న వారం రోజుల్లో దివ్యాంగులంతా అవకాశం ఉన్నంత వరకు తమ తమ గ్రామాలు, పట్టణాల్లో పర్యటించి ఆయా నియోజకవర్గాల్లోని వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. జగనన్న గెలుపునకు మేము సైతం అంటూ ఎలుగెత్తి చాటాలని కోరారు.

మరోసారి జగన్ సీఎం కావడం తథ్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



62వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో ఎన్ని కూటములు ఏకమైనా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తోన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 62వ డివిజన్‌లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెలంపల్లి సోదరుడు రాఘవతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హారతులతో బ్రహ్మరథం పట్టారు. ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారని మల్లాది విష్ణు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమాభివృద్ధి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మల్లాది విష్ణు పేర్కొన్నారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, గుణదల ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం రూ. 84.73 కోట్లతో వాంబేకాలనీలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వంలో కాపు కల్యాణమండపాన్ని కేవలం జీఓలకే పరిమితం చేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వంగవీటి మోహనరంగా పేరిట ఎల్బీఎస్ నగర్‌లో రూ. 1.25 కోట్లతో కల్యాణ మండపాన్ని నిర్మించుకున్నట్లు చెప్పారు. రూ. 80 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అనేక రోడ్లకు మోక్షం లభించిందన్నారు. లక్షలాది రూపాయలతో పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కోటిన్నరతో కాలువలను పునరుద్ధరించడం జరిగిందన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో 30 వేల మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అక్షరాల రూ. 270 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

టీడీపీ మేనిఫెస్టోను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు..

చంద్రబాబు మాయ మేనిఫెస్టోను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని మల్లాది విష్ణు అన్నారు. గతంలో 650కి పైగా వాగ్దానలిచ్చి ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అయితే, మేనిఫెస్టోలో 99.4 శాతం హామీలను నెరవేర్చిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను, పక్క రాష్ట్రాల పథకాలను కాపీ కొట్టే స్థాయికి బాబు దిగజారారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మోసపూరిత రాజకీయాలను మరోసారి గట్టిగా తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించవలసిందిగా కోరారు. వైఎస్సార్ సీపీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్, డివిజన్ కోఆర్డినేటర్ వీరబాబు, జిల్లా కార్యదర్శి మేడా రమేష్, రామిరెడ్డి, పసుపులేటి యేసు, అఫ్రోజ్, బుజ్జి, మారుతి, మహేష్, మస్తాన్, భవాని, ఖాదర్‌బీ, హైమావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



59వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ షాహీనాసుల్తానా



61వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్ 61వ డివిజన్ శాంతినగర్ భాస్కరరావుకొట్టు సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 61వ డివిజన్‌లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. డివిజన్‌లో మరింత అభివృద్ధి జరగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, కోఆర్డినేటర్ నాలం బాబు, అనిల్‌బాబు, నాగిరెడ్డి, హరిసాయి, రంగారెడ్డి, శివ, మాలకొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులకు మద్దతుగా స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా పాల్గొని నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం, తెలుగు బాప్టిస్ట్ చర్చీ రోడ్డు, లూనాసెంటర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నూతన ఎన్నికల మేనిఫెస్టోను వివరించి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, చింతా శ్రీను, షేక్ అమిత్, గెల్లిపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆదరించండి



దావు బుచ్చయ్యకాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి



26వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న కేశినేని పావని, వెలంపల్లి రాము, శ్రీలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలతో ప్రతీ ఇంటా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని, పేదల జీవితాలు బాగుపడాలంటే ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని వెలంపల్లి అల్లుడు మంచుకొండ చక్రవర్తి, కేశినేని నాని అల్లుడు కాజ రఘునాథం అన్నారు. 29వ డివిజన్ మధురానగర్ ఇందిరా కాలనీలో గురువారం మామయ్యల గెలుపును కాంక్షిస్తూ స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. విలువలు విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంభం కొండలరావు, కోలా రమేష్, దేవినేని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో..

30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు పనులు పూర్తిచేశామని, యూజీడీ, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తిచేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు

26వ డివిజన్‌లో..

26వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని కోరుతూ కేశినేని నాని సతీమణి కేశినేని పావని, వెలంపల్లి సోదరుడు వెలంపల్లి రాము, శ్రీలక్ష్మి, ఆ పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జి అంగిరేకుల గొల్లభామతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. మహిళల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై తప్పుడు ప్రచారం

కంకిపాడు: ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై చంద్రబాబు, కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరింపజేసే విధంగా ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కూటమితో అంటకాగుతూనే చట్టం అమలుపై విష ప్రచారం చేస్తూ ప్రజల్ని గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. రైతులకు ఇబ్బంది లేని విధంగా మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రైతులకు మేలు జరగడం కూటమి సహించలేకపోతుందని మండిపడ్డారు. కూటమి సాగించే విషప్రచారాన్ని కుట్రలను సాగనివ్వమని పేర్కొన్నారు. రైతాంగం చంద్రబాబుకు, ఆయన మిత్ర కూటమికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు పరిశీలించిన ఈఓ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులతో పాటు భక్తులకు దేవస్థానం అందిస్తున్న సేవలను ఈఓ కె.ఎస్.రామరావు గురువారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఎదుట దేవస్థానం నిర్మిస్తున్న లడ్డూ పోటు, అన్నదాన భవనం పనులను పరిశీలించారు. కనకదుర్గనగర్ నుంచి మహామండపానికి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న క్యూకాంప్లెక్స్ పనులను ఈఈ లింగం రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహా మండపం రెండు, మూడు అంతస్తులోని అన్నప్రసాద వితరణ తీరును పరిశీలించారు. అమ్మవారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో ఈఓ మాట్లాడారు. అన్నప్రసాద నాణ్యత, ఇంకా మెరుగైన సేవలను కల్పించే దిశగా వారిని అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం భక్తులకు అందిస్తున్న అన్నం నాణ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అమ్మవారి అన్నదానం స్వీకరించిన అనంతరం భక్తులు ఇచ్చే విరాళాలకు తగిన రశీదులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. విరాళాలు దుర్వినియోగం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హామీలన్నీ అమలు చేస్తాం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



23వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని పావని

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్ సూర్యారావుపేట ప్రాంతంలో గురువారం ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) సతీమణి పావని, సోదరుడు రామకృష్ణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారానికి వెళ్లిన వెలంపల్లి, కేశినేని పావనికి డివిజన్ ప్రజలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలు చేశామన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు చిత్తు కాగితంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కేశినేని నానిని ఎంపీగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తమను గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు, డివిజన్ నాయకులు వడ్డీ వాసు, విక్కీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ నాయకుడు ఆర్‌కే ఆధ్వర్యంలో 64వ డివిజన్ టీడీపీకి చెందిన 30 కుటుంబాలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తామంతా వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఎం.శివమణి, కె.ప్రసాద్, ఎం.విజయ్, కె.రవికిరణ్, బాబురావు, రామకృష్ణ, శేర్వన్, మధుసేన, ఎలీషా తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

■ స్థానిక వాంబేకాలనీ 60వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకుడు మీసాల రామకృష్ణ ఆధ్వర్యంలో 150 మంది మహిళలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే వైఎస్సార్ సీపీ స్టేట్ ఎలక్షన్ కోఆర్డినేటర్ గేరా హానోకు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 100 మంది మహిళలు ఎమ్మెల్యే వెలంపల్లి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ డైరక్టర్ షేక్ కాజా, వైఎస్సార్ సీపీ నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, ఎండీ ఇస్మాయేల్, ఫాతిమా, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే నాణ్యమైన విద్య, వైద్యం



దుర్గా అగ్రహారంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేసి ఓట్లు అభ్యర్థిస్తున్న కాజ రఘునాథం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ కేశినేని నాని అల్లుడు కాజ రఘునాథం అన్నారు. 25వ డివిజన్ పరిధిలోని దుర్గా అగ్రహారంలో గురువారం కార్పొరేటర్ బంకా శకుంతల, వెలంపల్లి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దుర్గా అగ్రహారంలో ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావును ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రఘునాథం మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావు విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండుటాకులకు తప్పని తిప్పలు

- పింఛన్ కోసం అవస్థలు
- కిటకిటలాడిన బ్యాంకులు



మధురానగర్ స్టేట్‌బ్యాంకులో పింఛన్‌దారుల రద్దీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అవ్వాతాతలకు పింఛన్ కష్టాలు తప్పడం లేదు. ప్రతీ నెలా ఠంఛన్‌గా ఒకటోతేదీన తలుపుతట్టి వలంటీర్‌లు పింఛన్ అందించేవారు. ఇప్పుడు పింఛన్ ఎప్పుడు వస్తుందో.. ఎలా వస్తుందో తెలియక పింఛన్‌దారులు అయోమయంలో ఉన్నారు. బ్యాంకులో పింఛన్ సొమ్ము వేశారని చెబుతున్నారని బ్యాంకులో పడ్డాయోలేదో తెలియడం లేదంటూ అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వయస్సులో బ్యాంకుకు వెళ్లలేను



ప్రతీ నెలా ఖచ్చితంగా ఒక టోతేదీ తెల్లవారుజామున వలంటీర్ దేవి తలుపుతట్టి పింఛన్ అందించేది. ఇప్పుడు బ్యాంకులో పింఛన్ వేశామని చెబుతున్నారు. ఈ వయస్సులో బ్యాంకుకు ఎలా వెళ్లాలో పింఛన్ సొమ్ము ఎలా తీసుకోవాలో తెలియడం లేదు. నేను బ్యాంకుకు వెళ్లాలంటే మరో ఇద్దరి సహకారం అవసరం.

– ఎర్రుబోయిన వీరరాఘవమ్మ, మధురానగర్

మండే ఎండలో బ్యాంకు వద్ద పడిగాపులు



ప్రతీ నెలా ఇంటివద్దనే పింఛన్ అందుకునే మాకు ఈ కష్టాలు ఏమిటో అర్థం కావడం లేదు. బ్యాంకులో పింఛన్ వేశారని చెప్పారు. కానీ ఒక పక్క మండే ఎండలతో పాటు బ్యాంకుల వద్ద రద్దీగా ఉంది. డబ్బులు ఎలా తీసుకోవాలో తెలియడం లేదు.

– చింతా రాధ, హనుమాన్ నగర్

మా ఉసురు తప్పక తగులుతుంది



ఇటీవలే నాకు కాటరాక్ట్ ఆపరేషన్ జరిగింది. పింఛన్ సొమ్ము కోసం ఆశగా ఎదురు చూస్తున్న నాకు బ్యాంకులో వేశారని చెబుతున్నారు. ఈ వయస్సులో ఎండల్లో బ్యాంకుకు నేను ఎలా వెళ్లగలను. అవ్వాతాతల పింఛన్‌లతో చంద్రబాబు రాజకీయం చేయడం తగదు. సాఫీగా జరిగిపోయే పింఛన్ పంపిణీని ఇలా చేయడం అన్యాయం. అవ్వాతాతల ఉసురు తప్పక తగులుతుంది.

– బుట్టి ఆంథోనమ్మ, రామలింగేశ్వరపేట

రేపటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల విధులకు హాజరుకానున్న పీవో, ఏపీవో, ఎన్నికల సిబ్బందికి ఈనెల 4, 6వ తేదీల్లో రెండురోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రపంచ వారసత్వ ప్రదేశాల సందర్శన అభినందనీయం



యువ యాత్రికులను సత్కరిస్తున్న ప్రముఖులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారతీయ కరెన్సీ నోట్లపై ముద్రించిన ప్రపంచ వారసత్వ ప్రదేశాలను సందర్శించడం అభినందనీయమని 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు అన్నారు. విజయవాడకు చెందిన షేక్.నయీమ్ పాషా, ఎం.ఉదయ్ నాగభూషణంలు 6,305 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారసత్వ ప్రదేశాలను ఏడు రోజుల్లో సందర్శించడంతో వారిని గురువారం ఘనంగా సత్కరించారు. చిట్టినగర్‌లోని శ్రీ గౌతమ్ స్మార్ట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నయీమ్ పాషా, ఉదయ్ నాగభూషణంలను అత్తులూరి పెదబాబు, శ్రీగౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ సూర్యారావు, గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు గాంధీ నటరాజన్‌లతో పాటు పలువురు సత్కరించారు. భారతీయ చారిత్రక ప్రదేశాల విశిష్టతను గుర్తించి అత్యంత వేగంగా ఆయా ప్రాంతాలను సందర్శించిన భారతీయ యాత్రికులుగా ఇద్దరు గుర్తింపు పొందారన్నారు. రూ.50 నోట్లపై ముద్రించిన హంపిలోని రాతి రథం, రూ.500 నోటుపై ముద్రించిన న్యూఢిల్లీలోని ఎర్రకోట, రూ.100 నోటుపై ఉన్న పఠాన్‌లోని రాణి కీ వావ్, రూ.20 నోటుపై ఉన్న ఔరంగాబాద్‌లోని ఎల్లోరా గృహలు, రూ.200 నోటుపై ఉన్న భోపాల్‌లోని సాంచి స్థూపం, రూ.10 నోటుపై ఉన్న కోణార్క్‌లోని సన్ టెంపుల్‌ను ఏడు రోజుల్లో సందర్శించామని నయీమ్ పాషా, నాగభూషణం తెలిపారు. గత నెల 19వ తేదీన గుంటూరు నుంచి రైలులో యాత్రను ప్రారంభించామన్నారు. యువ యాత్రికులను సత్కరించిన వారిలో బీజేపీ నాయకులు శివకుమార్ పట్నాయక్, అవ్వారు బుల్లాబ్బాయ్ తదితరులు ఉన్నారు.

సుజనా చౌదరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్న పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ కోరారు. ఈ మేరకు ఆయన భవానీపురం ఇన్‌స్పెక్టర్ కృష్ణకు గురువారం ఫిర్యాదు చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరి అధ్యక్షతన ఇటీవల జరిగిన ఒక సమావేశంలో టీడీపీ నాయకుడు జలీల్‌ఖాన్ కొంత మంది ఓటర్ల చేత 'దేవుడి సాక్షిగా, అమ్మవారి సాక్షిగా' సుజనా చౌదరికి ఓటేసి గెలిపిస్తామని ప్రమాణం చేయించారన్నారు. ఇది కచ్చితంగా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని గౌస్ మొహిద్దీన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుతో పాటు తాను ఇచ్చిన రికార్డెడ్ ఆధారాల సాక్ష్యంగా తక్షణమే సుజనా చౌదరి, జలీల్‌ఖాన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు అందజేసిన వారిలో గౌస్ మొహిద్దీన్ తోపాటు వైఎస్సార్ సీపీ లీగల్ టీమ్ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు నంబూరు ప్రదీప్, సాంబిరెడ్డి, ప్రసాద్, వెంకటరెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.